సాక్షి

పశ్చిమగోదావరి

శుక్రవారం । 29 । మార్చి । 2024



హుండీ ఆదాయం లెక్కింపు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 90 రోజులకు రూ.7,76,100 వచ్చింది.



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు మొగల్తూరు మండలం కుమ్మరుపురుగుపాలెంకు చెందిన అందే వెంకటకృష్ణ రూ.1,00,116ను విరాళంగా అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సాయంత్రం)	సహరి శనివారం (ఉదయం)
భీమవరం	6.23	4.42
ఏలూరు	6.25	4.39

న్యూస్‌రీల్

ఎన్నికల గోడౌన్ పరిశీలన



గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఈవీఎం గోడౌన్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 12న ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్, మే 1న రెండో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాలకు ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య తరలిస్తామన్నారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

7.50 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం : జేసీ



మాట్లాడుతున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం: జిల్లాలో దాళ్వా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. గురువారం భీమవరం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై జిల్లాస్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ, సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 9.45 లక్షల టన్నులు ధాన్యం దిగుబడి అంచనా కాగా 7.50 లక్షల టన్నుల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా రైతు భరోసా కేంద్రాల్లో వసతులు కల్పిస్తామన్నారు. ఈ మేరకు జిల్లాలో 324 రైతు భరోసా కేంద్రాలను, 1.80 కోట్ల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. ధాన్యం కొనుగోలుకు ముందుగానే గోనె సంచులను ఆర్‌బీకేలకు తరలించాలన్నారు. జిల్లాలో 211 రైసు మిల్లులకు కస్టోడియన్ అధికారులు, మండలస్థాయి సేకరణ కమిటీలను నియమించామన్నారు. ధాన్యం రవాణాకు 2,600 వాహనాలను సిద్ధం చేశామన్నారు. మిల్లర్ల ద్వారా బ్యాంకు గ్యారంటీ పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. ప్రతి వాహనానికీ జీపీఎస్‌తో పాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం ఆర్డీఓలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, ఏఎస్ఓ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

ఆర్కిడ్ సొసైటీ ఉపాధ్యక్షుడిగా జానకిరామ్



తాడేపల్లిగూడెం: ది ఆర్కిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా రెండోసారి తాడేపల్లిగూడెం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి టి.జానకిరామ్ ఎంపికయ్యారు. మహారాష్ట్ర పూనెలో ఇటీవల ఆర్కిడ్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు, వర్క్‌షాపులో ఆయన్ను ఎంపికచేశారు. జానకిరామ్ రెండేళ్లపాటు పదవిలో ఉంటారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆర్కిడ్ సాగును ప్రోత్సహిస్తూ గిరిజన రైతులకు ఉద్యాన వర్సిటీ చేయూతనిస్తుందన్నారు. వివిధ పరిశోధనా పత్రాలను ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.నారం నాయుడు, అధికారులు ఆయన్ను అభినందించారు.

కల్యాణ మండపాల రుసుముల పెంపునకు నిర్ణయం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవారి కొండపై, కొండ దిగువన భక్తులు వివాహాది శుభకార్యాలు జరుపుకునే దేవస్థానం కల్యాణ మండపాల రుసుములను పెంచేందుకు ధర్మకర్తల మండలి తీర్మానించిందని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు గురువారం ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వహణ, శానిటేషన్, విద్యుత్ వంటి ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. పెరిగిన ధరలకు అదనంగా జీఎస్టీ, మెయింటినెన్స్ రుసుములను చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కల్యాణ మండపాల రుసుముల పెంపుపై అభ్యంతరాలు ఉంటే భక్తులు 15 రోజుల్లోపు 08829-271469, 271436 ఫోన్ నంబర్ల ద్వారా తెలియజేయాలని సూచించారు.

టీడీపీ నేత దాష్టీకం

- ఆలయ కార్యదర్శిపై అమానుష దాడి
- వేంకటేశ్వరస్వామి పేరుతో భక్తుల సొమ్ము దోపిడీ
- ఆలయ నిధుల కైంకర్యంపై ఆరా తీయటంతో టార్గెట్
- కల్యాణ మండపం నిర్మాణంలోనూ అవకతవకలు?
- టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు రక్షణ ఉండదు : బాధితురాలు అచ్యుతకుమారి ఆవేదన



ఏలూరు జీజీహెచ్‌లో బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే ఆళ్ల నాని (ఫైల్), కమిలిపోయిన బాధితురాలి కంటి భాగం (ఇన్‌సెట్‌లో)



గుడిలో దాడికి ఉపయోగించిన మైక్ స్టాండ్

సాక్షి ప్రతినిధి, ఏలూరు /ఏలూరు టౌన్: ఏలూరులో శ్రీ లక్ష్మీ శ్రీనివాస పద్మావతి అమ్మవార్ల (శ్రీ వేంకటేశ్వర స్వామి) ఆలయ కమిటీ కార్యదర్శి చవాన్ అచ్యుతకుమారిపై టీడీపీ నాయకుడు అమానుష దాడికి తెగబడ్డాడు. దశాబ్ద కాలానికి పైగా స్వామివారి పేరుతో భక్తుల సొమ్మును దిగమింగుతున్న టీడీపీ నేత అవినీతిని ప్రశ్నించటంతో టార్గెట్ చేసి మరీ అత్యంత దారుణంగా హత్య చేసేందుకు కుట్రలు చేసి దాడికి పాల్పడ్డారంటూ బాధితురాలు ఆరోపిస్తున్నారు. మూడు రోజుల పాటు ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స అనంతరం బాధితురాలు కాస్త కోలుకోగా, ఆమెపై దాడికి సంబంధించిన పూర్తి వివరాలను తెలియజేశారు.

టీడీపీ నేత రెడ్డి నాగరాజు కీచకపర్వం

వేంకటేశ్వరస్వామి ఆలయం పేరుతో దోపిడీకి పాల్పడుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతానికి చెందిన భక్తులు ఇటీవల కొత్త కమిటీని ఎన్నుకున్నారు. నెల రోజుల క్రితం ఈ కమిటీలో నూతన కార్యదర్శిగా అచ్యుతకుమారిని ఎన్నుకున్నారు. అచ్యుతకుమారి స్వామివారి ఆలయం ఆదాయం, అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం, పాత కమిటీ నిధుల సేకరణ, ఖర్చులపై ఆరా తీస్తూ ఉండడంతో పాత కమిటీ కార్యదర్శి, టీడీపీ నాయకుడు రెడ్డి నాగరాజు ఆమెపై కక్ష పెంచుకున్నాడు. కల్యాణ మండపం నిర్మాణం, స్థలం రిజిస్ట్రేషన్, విరాళాల వివరాలపై నూతన కార్యదర్శి అచ్యుతకుమారి ప్రశ్నిస్తూ... వివరాలు కావాలంటూ ఒత్తిడి తేవటం పాత కమిటీలోని నాయకులకు ఆగ్రహం తెప్పించింది. ఈనెల 25న శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో ఆలయంలో కూర్చుని ఉన్న అచ్యుతకుమారిపై టీడీపీ నాయకుడు రెడ్డి నాగరాజు మైకు స్టాండ్ రాడ్డుతో దాడి చేశాడు. ఆమె గుండెలపై పిడిగుద్దులు గుద్దటంతో పాటు కంటిపైనా ఇష్టారాజ్యంగా కొట్టాడు. బాధితురాలిని బుధవారం ఏలూరు జీజీహెచ్‌లో ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పరామర్శించి ధైర్యం చెప్పారు. మీ కుటుంబానికి అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని, న్యాయం జరిగే వరకు తోడుంటామని భరోసా ఇచ్చారు.

రెడ్డి నాగరాజు కనుసన్నల్లోనే..

శ్రీ లక్ష్మీ శ్రీనివాస పద్మావతి అమ్మవార్ల ఆలయ కమిటీ పేరుతో రెడ్డి నాగరాజు అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 17 ఏళ్లుగా పక్కా పథకం ప్రకారమే ఆలయ భక్తుల విరాళాలు, సొమ్ములను కైంకర్యం చేస్తున్నారని అంటున్నారు. ఆలయానికి సంబంధించి కనీసం బిల్లు పుస్తకం కూడా లేకుండా, కమిటీని రెన్యూవల్ చేయకుండా నాగరాజు తన కనుసన్నల్లోనే నడిపిస్తున్నాడని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ కల్యాణ మండపానికి సైతం అప్పటి కమిటీ ప్రెసిడెంట్ రామారావు పేరుతో రిజిస్ట్రేషన్ చేయటంలోనూ నాగరాజు కీలకపాత్ర పోషించాడని చెబుతున్నారు. కల్యాణ మండపం నిర్మిస్తున్న సమయంలోనే నాగరాజు సొంతంగా అదే ప్రాంతంలో పెద్ద భవనాన్ని నిర్మించటం విమర్శలకు మరింత బలాన్నిస్తోంది.

టీడీపీ గెలిస్తే మహిళలకు రక్షణ కరువు

అచ్యుతకుమారి, ఆలయ కార్యదర్శి, బాధితురాలు



ఏలూరు టీడీపీ నాయకుడు రెడ్డి నాగరాజు తనపై అత్యంత దారుణంగా దాడి చేసి చంపేందుకు కుట్ర చేశాడని బాధితురాలు, ఆలయ కార్యదర్శి అచ్యుతకుమారి తెలిపారు. పాత కమిటీ నాయకుడు ఉమామహేశ్వరరావు సైతం అతనికి సహకరిస్తున్నారని ఆరోపించారు. కల్యాణమండపం భవనానికి కనీసం ప్లాన్ అప్రూవల్ లేదని, పంచాయతీ అనుమతి కూడా తీసుకోలేదని, దాతల నుంచి విరాళాలుగా నగదు, బంగారం సేకరించారని, వాటిపై నిలదీశాననే కారణంగా తన అడ్డు తొలగించుకునేందుకు ప్లాన్ చేశారన్నారు. ఐదేళ్లుగా ఏలూరు నగరంలో ప్రజలు ప్రశాంతంగా జీవించారని, ఎన్నికలు సమీపించటంతో తామే గెలుస్తామని, మీ అంతు చూస్తామంటూ టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలిస్తే ఇక సాధారణ ప్రజలు, మహిళలకు రక్షణ ఉండదని, రౌడీరాజ్యం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తనకు, తన కుమారుడు, కుటుంబ సభ్యులకు టీడీపీ నేత రెడ్డి నాగరాజుతో ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఆమె కోరారు. తనపై దాడి జరిగిన రోజునే తన కుమారుడిపై సైతం దాడి చేసి హతమార్చేందుకు రౌడీలను పంపారని అచ్యుతకుమారి వాపోయారు.

కల్యాణ మండపం పేరుతో అవినీతి?



ఏలూరు కంద్రికగూడెంలో లక్ష్మీ శ్రీనివాస పద్మావతీ అమ్మవార్ల ఆలయం

ఆలయం పక్కన 330 గజాల స్థలం ఉంది. ఆలయ నీడ పడుతుందనే కారణంగా ఈ స్థలాన్ని ఎవరూ కొనుగోలు చేయలేదు. దాత ఈ స్థలాన్ని ఆలయం కోసం ఇచ్చినా ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయలేదు. 13 ఏళ్ల క్రితం ఆలయ కమిటీ కల్యాణ మండపం నిర్మాణానికి నిర్ణయించగా, స్థలం దాత బెల్లంకొండ వెంకటేశ్వరరావు మృతిచెందటంతో ఆయన కుమారునితో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అయితే ఆలయం పేరున కాకుండా అప్పటి కమిటీ ప్రెసిడెంట్ బడుగు రామారావు పేరుతో స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం నాలుగేళ్ల క్రితం కల్యాణ మండపం నిర్మాణానికి భారీ ఎత్తున నిధులు వసూలు చేశారని, అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక ఈ ఆలయ కమిటీ ఎనిమిదేళ్లుగా రెన్యూవల్ చేయకుండా ఉందని, భక్తుల దానాలకు కనీసం రసీదు లేకుండానే కమిటీ పేరుతో దోపిడీ చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. కల్యాణ మండపం నిర్మాణానికి సంబంధించి కోట్లాది రూపాయలు వసూలయ్యాయని, వాటికి లెక్కాపత్రాలు లేకుండా కమిటీ పేరుతో దోచేశారని పలువురు అంటున్నారు.

పాలనను చేరువ చేసిన జగన్

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

మొగల్తూరు: ప్రజలకు సేవలు, సంక్షేమ పాలనను అందించడంలో సీఎం జగన్ ముందంజలో ఉన్నారని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ప్రజాశ్వీరాద ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మొగల్తూరులోని నెంబర్-1 పాఠశాల ఏరియా, వేగివారిపేట, దయాల్‌దాస్‌పేట, చిన్న గొల్లగూడెం, పాతకాలు, కొండావారిపాలెం, గోడావారిపాలెం, కాసానావారిపే, పడమటిపాలెం ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ లబ్ధి చేకూరిందన్నారు. జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల కంటే అధికారం చేపట్టిన తర్వాత మరిన్ని హామీలు నెరవేర్చారన్నారు. మొగల్తూరులో రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్‌లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా పైపులైనులు, కుళాయిలు ఏర్పాటుచేశామన్నారు. గత పాలకులు కంటే మెరుగైన సంక్షేమ పాలన అందిస్తున్న జగన్ మరోమారు అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. శ్రీ కృష్ణంరాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు వేండ్ర వెంకటస్వామి, జెడ్పీటీసీ తిరుమాని బాపూజీ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, నాయకులు ఉన్నారు.

రామానాయుడూ.. డ్రామాలు ఆపు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి



వృద్ధురాలిని ఆశీర్వదించమంటున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్: రాజకీయాలంటే మనం చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలి.. లేదా అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పాలి గాని.. వ్యక్తిగత విమర్శలతో ప్రజలను మోసం చేస్తూ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రాజకీయ డ్రామాలు ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. గురువారం మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పుష్కరాల్లో వచ్చిన నిధుల్లో ఎమ్మెల్యే నిమ్మల నియోజకవర్గంలో ఎన్ని పనులు చేయించారు, ఎన్ని నిధులు వెనకేసుకుని బెంగళూరు తరలించారో తెలుసు అని అన్నారు. నాడు బినామీ రూపంలో బెంగళూరుకు తరలించి దాచుకున్న సొమ్ములు ఇప్పుడు ఎన్నికల రూపంలో ఖర్చు చేసుకోవడానికి తీసుకువస్తున్నట్టు తెలిసిందని మండిపడ్డారు. డ్రామాలాడటం వదిలి హుందాగా ప్రవర్తించాలని హితవుపలికారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అందుతున్నాయని, పింఛన్ రూ.3 వేలు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. తండ్రికి మించిన తనయుడిగా సీఎం జగన్ ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. మళ్లీ జగనన్నను ఆదరిస్తే మరిన్ని సంక్షేమ ఫలాలు అందిస్తారని అన్నారు. గోపీతో పాటు ఆయన భార్య, కుమారుడు ప్రచారం చేశారు.

రాష్ట్రంలో అన్ని వర్గాలకూ న్యాయం

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు



ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: రాష్ట్రంలో అన్నివర్గాలకు సమన్యాయం చేస్తూ పారదర్శక పాలన అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం ఆయన పెనుమంట్ర మండలంలోని వెలగలవారిపాలెం, జుత్తిగ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. జగనన్న ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరారు. వీధివీధినా ప్రజలు ఆయనకు నీరజనాలు పట్టారు. ఆచంట ఎమ్మెల్యేగా శ్రీరంగనాథరాజు, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకుంటామని అన్నారు. జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు మాండ్రు శాంతకుమారి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఈది అనిత, వాసంశెట్టి కిరణ్, సర్పంచ్ తవనంపూడి వీర్రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ మంత్రి కొట్టును గెలిపించుకుంటాం

ఆర్‌ఎంపీల సంఘ నాయకులు



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను తమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా మళ్లీ గెలిపించుకుంటామని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. స్థానిక కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో గురువారం డిప్యూటీ సీఎం కొట్టు ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గతం నుంచి మంత్రి కొట్టు తమకు అండగా ఉన్నారన్నారు. అనంతరం మంత్రి కొట్టు మాట్లాడుతూ కరోనా విపత్తుల సమయంలో ఆర్‌ఎంపీల సేవలు మరువలేమన్నారు. తాను మొదటి నుంచి పట్టణంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి శ్రమించానన్నారు. ప్రశాంతమైన జీవనం గడిపేందుకు ప్రజలకు చట్టబద్ధమైన రక్షణలో శాంతిభద్రతలు అమలు చేశామన్నారు. వ్యాపార, విద్యారంగంలో తాడేపల్లిగూడేన్ని జాతీయ స్థాయిలో నిలిపామన్నారు. తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇంతకు మించి అభివృద్ధి చేస్తానని.. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు మునగాల జితేంద్ర, కార్యదర్శి కొల్లి రాజశేఖర్, కోశాధికారి కొడిసి రమేష్, పూర్వాధ్యక్షుడు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, వై.గోపాలకృష్ణ, నాయకులు కర్రి భాస్కరరావు, మానుకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో ఉద్యాన పంటల సాగు

భీమవరం: సన్న, చిన్నకారు రైతులకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటలు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంటల సాగు, మడ అడవులు పెంపకంపై ఆయన సమీక్షించారు. జిల్లాలో 2 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు పలు రకాలకు చెందిన సుమారు 1.50 లక్షల మొక్కలను రైతులకు పంపిణీ చేయాలన్నారు. పంట చేతికి వచ్చేవరకు (మూడేళ్లు) ఎరువులు, నిర్వహణ, సంరక్షణ ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందన్నారు. అలాగే రైతులకు ఆరుతడి పంటలకు ప్రోత్సాహం అందించాలన్నారు. మడ అడవుల మొక్కలను సముద్ర పరీవాహక ప్రాంతాల్లో పెంచాలన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఆర్.దేవానందకుమార్, జిల్లా అటవీశాఖ అధికారి డీఏ కిరణ్, ప్లాంటేషన్ మేనేజర్ కె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఓట్లడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

విప్ గ్రంధి శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని నేలపోగుల, మడుగు పోలవరం, ఉత్తరపాలెం, నవుడూరు, అండలూరు, తోలేరు, బీజే పాలెం, కొణితివాడ, పంజావేమవరం గ్రామాల్లో ఆయన కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో సీఎం జగన్ ప్రజలకిచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా నెరవేర్చారన్నారు. కరోనా వైద్యాన్ని కూడా వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందించారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలను పంపిణీ చేయగా, భీమవరం నియోజకవర్గంలో 15 వేల మందికి పైగా అందించామన్నారు. నవరత్నాల పథకాల పేరుతో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూర్చామన్నారు. అవినీతికి తావులేకుండా పక్కా పారదర్శకంగా పథకాలను డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో అందించామన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600కు పైగా హామీలిచ్చి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి ఓట్లు అభ్యర్థించాలని ఆయన కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, వైసీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు చేసిన మంచిని వివరించండి

మంత్రి కారుమూరి



ఉనికిలిలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మీ కుటుంబానికి మంచి జరిగితేనే నాకు అండగా నిలబడమన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషిచేయాలని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం అత్తిలి మండలంలోని ఆరవల్లి, దంతుపల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం, బల్లిపాడు, తిరుపతిపురం, ఉరదాళ్లపాలెం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. 58 నెలల కాలంలో సీఎం జగన్ రాష్ట్రంలో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేసేలా పాలన సాగించారని, అదేవిషయాన్ని ప్రజలకు తెలియజేసి ఓట్లుగా మలుచుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసేలా చూడాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టడంలో విజయం సాధించగలిగితే ఫ్యాన్ స్పీడుకు కూటమి కుప్పిగంతులు వేస్తుందని ఎద్దేవా చేశారు. ఐక్యంగా పనిచేసి విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ హబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, యువజన విభాగం జిల్లా కార్యదర్శి రామిశెట్టి రాము, నాయకులు పాల్గొన్నారు.

పెళ్లింట్లో భారీ చోరీ

పాలకొల్లు సెంట్రల్ : పట్టణంలోని ఓ పెళ్లి ఇంట్లో భారీ చోరీ జరిగింది. పెళ్లి కోసం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి మండపానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని సుబ్బారాయుడి గుడి సెంటర్ సమీపంలోని బెజవాడ వారి వీధిలో బ్రింగిమళ్ల నాగేశ్వరరావు కుటుంబంతో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి కుమార్తె వివాహం లయన్స్ కమ్యూనిటీహాల్‌లో జరగనుంది. అదేరోజు సాయంత్రం ఐదు గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు కల్యాణమండపం వద్దకు వెళ్లారు. రాత్రి 2 గంటల సమయంలో వివాహం జరగగా, అతిథులకు ఇచ్చేందుకు ఇంట్లో సిద్ధంగా ఉంచిన బహుమతులను తీసుకురావాలని రాత్రి 3 గంటల సమయంలో నాగేశ్వరరావు బంధువులకు చెప్పారు. వారు ఇంటికి వెళ్లగా తలుపులు తెరిచి ఉండటం చూసి అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయి. దీనిని వీడియోకాల్ ద్వారా నాగేశ్వరరావుకు వారు చూపించారు. నాగేశ్వరరావు ఇంటికి వచ్చి బీరువాలో ఉండాల్సిన రూ.8.50 లక్షల నగదు, నాలుగు కాసుల బంగారపు చెయిన్ కనిపించకపోవడంతో చోరీకి గురయ్యాయని గ్రహించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెళ్లి భోజనాలు, ఈవెంట్ ఖర్చుల నిమిత్తం ఈ మొత్తాన్ని సిద్ధంగా ఉంచుకున్నట్లు నాగేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆధారాల కోసం ప్రయత్నించాయి. సీఐ కె.మంగాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.8.50 లక్షలు నగదు, 4 కాసుల బంగారం అపహరణ



పెళ్లి ఇంట్లో బద్దలు కొట్టి ఉన్న బీరువా

అధికారం కోసం చంద్రబాబు ఎంతకైనా దిగజారతారు

తణుకు అర్బన్: అధికారం కోసం ప్రతిపక్షనేత చంద్రబాబు ఎంత కైనా దిగజారుతాడని, ఆఖరుకు గాడిద కాళ్లు పట్టుకోవడానికైనా సిద్ధమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. తణుకు హౌసింగ్ బోర్డు కాలనీలో గురువారం నిర్వహించిన సమావేశంలో ప్రతిపక్షాలపై ఆయన ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌పై ఒంటరిగా పోటీ చేస్తే ఓడిపోతామని వెన్నులో వణుకుపుట్టి అందరి కాళ్లు పట్టుకుని మూడు కండువాలతో వెళుతున్నాడని విమర్శించారు. పార్టీ స్థాపించి 12 ఏళ్ల అయినా ఇంతవరకు తన పార్టీ తరపున ఒక్క ఎమ్మెల్యేని అసెంబ్లీకి పంపించలేకపోయిన పవన్‌ను వెంటపెట్టుకుని ఎన్నికలకు వెళుతున్న చంద్రబాబుకు మరో సారి ఘోర ఓటమి తప్పదని దుయ్యబట్టారు. అంతేకాకుండా బీజేపీ నేత పురందేశ్వరి, షర్మిల, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను కూడా రంగంలోకి దింపారంటే చంద్రబాబుకు జగన్ అంటే ఎంత భయం పుట్టిందో అర్థమవుతోందన్నారు. ప్రజలనే నమ్ముకున్న సీఎం వైఎస్ జగన్ సిద్ధం సభలను సక్సెస్ చేసిన ఊపుతో ఇప్పుడు బస్సు యాత్రలు చేస్తున్నారని ఆ యాత్రకు కూడా స్పందన భారీగా ఉండడాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు.

కుమారుడిని కత్తితో పొడిచాడని..

- దాడి చేసిన భార్య.. భర్త మృతి
- ఉండ్రాజవరంలో ఘటన

ఉండ్రాజవరం: భార్యాభర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త మృత్యువాత పడగా, కుమారుడు కత్తిపోటు గాయానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంకు చెందిన గుల్లంకి వెంకట్ (44), ఉండ్రాజవరం గ్రామానికి చెందిన పార్వతికి 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, వారికి కొడుకు, కూతురు ఉన్నారు. అయితే పది ఏళ్లుగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. వెంకట్ తన స్వగ్రామం తాడేపల్లిగూడెంలో ఉంటుండగా, పార్వతి తన ఇద్దరు పిల్లలతో ఉండ్రాజవరంలో ఉంటోంది. వెంకట్ అప్పుడప్పుడూ వచ్చి పార్వతిని తనతో వచ్చేయమని గొడవ పడుతుండేవాడు. ఇటీవల కుమార్తె పెళ్లి కారణంగా వచ్చిన వెంకట్ పది రోజుల నుంచి ఉండ్రాజవరంలోనే ఉంటున్నాడు. బుధవారం రాత్రి పార్వతిని తనతో వచ్చేయాలంటూ మళ్లీ గొడవకు దిగాడు. దీంతో భార్య పార్వతి, కొడుకు కృష్ణవంశీతో తీవ్ర ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో కృష్ణవంశీని వెంకట్ కత్తితో పొడిచాడు. కొడుకు కత్తి పోటుకు గురికావడంతో చలించిన పార్వతి ఒక్కసారిగా భర్తపై ఇటుకతో దాడికి పాల్పడింది. వెంకట్ దాడిని ప్రతిఘటించే క్రమంలో తల్లీకొడుకు ఇద్దరూ కలిసి ఇటుకలతో వెంకట్ తలపై కొట్టడంతో వెంకట్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే తేరుకున్న పార్వతి గాయపడిన భర్త, కొడుకును తణుకు ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా వెంకట్ పరిస్థితి విషమంగా ఉండటంతో తణుకు నుంచి ఏలూరు, అక్కడ నుంచి విజయవాడకు తరలించారు. గురువారం తెల్లవారుజామున వెంకట్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కొడుకు కృష్ణవంశీ ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఉండ్రాజవరం ఎస్సై వి.అప్పలరాజు కేసు నమోదు చేయగా, నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరావు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గేట్‌లో మెరిసిన నిట్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్ 2024) పరీక్షా ఫలితాల్లో ఏపీ నిట్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో మెరిశారు. ఈ వివరాలను గురువారం నిట్ అధికారులు తెలిపారు. జాతీయస్థాయిలో మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. జయంత్ హరిదాస్ పిశాల్ (బయోటెక్నాలజీ) 20వ ర్యాంకు, పూజారి కేశవ సుబ్రహ్మణ్యం (ఎలక్ట్రికల్) 32వ ర్యాంకు, పెద్ది సిద్ధార్థ(కెమికల్) 45వ ర్యాంకు, రామిరెడ్డి వెంకటసాయిరెడ్డి (బయో టెక్నాలజీ) 59వ ర్యాంకు సాధించారు. రుషినాథ్ (ఎంఎంఈ) 100వ ర్యాంకు, అభిరామ్ కల్లూరి (కెమికల్)103వ ర్యాంకు, ఆదిరాజు రామమోహన్ (సీఎస్ఈ) 124వ ర్యాంకు, సారవ్‌కుమార్ (ఎంఎంఈ) 135వ ర్యాంకు పొందారు. శశాంక్(బయోటెక్నాలజీ) 149వ ర్యాంకు, ఆరిఫ్ (ఎంఎంఈ) 154వ ర్యాంకు, బి.జీవన్ సంజయ్ (బయో టెక్నాలజీ) 177వ ర్యాంకు, మల్లా రామ్‌కుమార్ (కెమికల్) 351 జాతీయ ర్యాంకులను పొందారు.



ప్రజల హృదయాల్లో జగన్ సుస్థిరం

- సంక్షేమ రాజ్యాన్ని కాపాడుకొందాం
- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ


వెలమసంఘు సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం రాత్రి పెంటపాడు గ్రామంలోని దాసరి అప్పారావు స్వగృహం వద్ద వెలమ సంక్షేమసంఘ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సీఎం అయిన నాటి నుంచి ఇప్పటి వరకు ప్రజలకు ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి సంక్షేమ రాజ్యం తెచ్చారన్నారు. గత పాలనలో చంద్రబాబు మోసాలను చవిచూసామన్నారు. నేడు మళ్లీ మోసం చేసేందుకు జతకట్టిన పార్టీలతో ప్రజలను వంచించేందుకు సిద్ధమవుతున్నారన్నారు. జగనన్న పరిపాలనలో పథకాలు కాకుండా దేవాలయాల అభివృద్ధికి రూ.600 కోట్ల నిధులు అందించి నూరుశాతం పథకాలు అమలు చేసిన ఘనతను జగన్ పొందారన్నారు. జగనన్న చేపడుతున్న బస్సుయాత్రకు జనం జేజేలు పలుకుతున్నారన్నారు. వెలమ సంక్షేమ సభ్యులు మరోమారు తాను ఎమ్మెల్యే అయ్యేందుకు, తద్వారా జగనన్న సీఎం చేసేందుకు కృషి చేయాలన్నారు. మోసపూరిత పార్టీలను ప్రజలు నమ్మవద్దన్నారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ మాట్లాడుతూ నేడు జనసేన అభ్యర్థి గతంలో మున్సిపల్ అభివృద్ధికి విఘాతం కలిగించిన సంగతిని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఆయన ప్రజలు చేసింది శూన్యమన్నారు. రహదారులు, డ్రెయినేజీలు, పట్టించుకోకుండా ఇష్టాను సారంగా తీర్మానాలు చేసి ప్రజాధనాన్ని దోచుకొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కొలుకులూరి ధర్మరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, చెన్నా జనార్ధన్, ఎంపీపీ దాసరి హైమావతి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, మారిపిన రామకృష్ణ, కర్రి భాస్కరరావు, ఏఎంసీ డైరెక్టర్ సలుమూరి ప్రకాష్, బర్లజయ రాంబాబు, రెడ్డి శ్రీను, బందారు రాంబాబు, కొలుపూరి శివకిరణ్, ఏవీఎస్, పెంటపాడు వెలమ సంక్షేమ సంఘ సభ్యులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి


భవిత సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కర్నాటి కన్నయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో న్యాయవాది కర్నాటి కన్నయ్య ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు అన్నసమారాధన నిర్వహించారు. కర్నాటి కన్నయ్య మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పిల్లలను ఆదరించాలని, వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. దాతలు సాయి కుమారి, లలితా దేవి, భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోమరాజు కుటుంబానికి పరామర్శ


సోమరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన వల్లేపల్లి సోమరాజు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా గురువారం వారి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య పరామర్శించారు. సోమరాజు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట మాధవరం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు తమ్మిశెట్టి రఘు, గోపిశెట్టి దొరబాబు తదితరులు ఉన్నారు.

ఘనంగా నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ


నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కారుమూరి

ఇరగవరం: మండలంలోని ఉమాపాలేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నందీశ్వర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాశీశ్వరస్వామి ఆలయ చైర్మన్ తంగిరాల పాలగోపాలకృష్ణ, వేసపాటి లక్ష్మిగణపతి శాస్త్రి దంపతులు, తంగిరాల ప్రదీప్ సిద్ధాంతి పాల్గొన్నారు.

అభయ గణపతికి అభిషేకాలు


గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫాల్గుణ బహుళ సంకష్టహర చవితి పురస్కరించుకుని పట్టణంలోని రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ యోగధ్యాన మందిరంలో అభయ గణపతికి గురువారం పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అధిక భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఓటేయడం మన బాధ్యత


తాడేపల్లిగూడెం(టీఓసీ): ఓటు హక్కుపై అవగాహన దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయడం మన బాధ్యత అని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక బస్సు కాంప్లెక్స్‌లో ట్రాన్స్ జెండర్స్‌కు జిల్లా నోడల్ అధికారి అగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో పోలింగ్ 82 శాతం నుంచి 92 శాతం పైగా నమోదు అయ్యేలా మనమంత కృషి చేయాలన్నారు. మేము తప్పక ఓటు వేస్తాం, మీరు కూడా ఓటు వెయ్యండి అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది, ట్రాన్స్ జెండర్స్ తదితరులు పాల్గొన్నారు.



పెంటపాడు: మాట్లాడుతున్న నోడల్ అధికారి ప్రభాకర్

డీఆర్‌జీలో ఓటుపై అవగాహన సదస్సు

పెంటపాడు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఓటర్ల అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎన్నికల సంఘ నోడల్ అధికారి ప్రభాకర్, మండల ఈవోపీఆర్డీ ప్రసాద్‌లు విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జాన్ బాబు, ఎన్ఎస్ఎస్ పీవో జె. విజయబాబు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ విగ్రహ ప్రతిష్ఠ


దర్శిపర్రు రామాలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు గ్రామంలో సీతారామాంజనేయ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక యాగాలు చేశారు. గురువారం మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి నిర్వహించారు. సుమారు 7 వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఆలయ ప్రతిష్ఠ పూజల్లో ఉపముఖ్యమంత్రి, దేవాదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయానికి మంత్రి కొట్టు సత్యనారాయణ రూ. 60 వేలు, కల్యాణ మండపానికి మరో 20 వేలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, సర్పంచ్ కోలా శేషవేణి, సొసైటీ అధ్యక్షుడు గుండమోగుల సాంబయ్య, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దానేశ్వరి హుండీ ఆదాయం రూ.5.21 లక్షలు

తణుకు టౌన్: మండలంలోని దువ్వ గ్రామంలో దానేశ్వరి అమ్మవారి హుండీ ఆదాయం రూ. 5 లక్షల, 21 వేల 105లు లభించినట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆలయం వద్ద తణుకు డివిజన్ దేవాదాయ, ధర్మదాయ శాఖ తనిఖీ దారు జీఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో దానేశ్వరి అమ్మవారి 50 రోజుల హుండీలను లెక్కించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, వివిధ దేవాలయాల ఈవోలు లోకనాథ్, సాయి, శ్రీనులతో పాటు సత్యసాయి సేవా సమితి సభ్యులు, దువ్వ గ్రామానికి చెందిన మహిళలు పాల్గొన్నారు.

పెత్తందార్లతో యుద్ధం చేస్తున్న సీఎం జగన్

అత్తిలి మండలం వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మంత్రి కారుమూరి


ఆరవల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: పేదల భవిష్యత్తు కోసం పెత్తందారులతో యుద్ధం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండంలో గురువారం నిర్వహించిన ఎన్నికల శంఖారావం కార్యక్రమంలో భాగంగా పలు గ్రామాల్లో ఆయన పర్యటించి వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ పేద ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపరిచేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతుంటే ప్రతిపక్షాలు మాత్రం ఏదోక రకంగా మొదటి నుంచి అడ్డుపడుతూనే ఉన్నాయని విమర్శించారు. ఏ మంచి పని చేద్దామన్నా న్యాయస్థానాలను ఆశ్రయించి నిలుపుదల చేయడమో, లేదంటే పచ్చమీడియాలో దుష్ప్రచారం చేయించడమో చంద్రబాబుకు అలవాటుగా మారిపోయిందని అన్నారు. నిన్ను నమ్మం బాబూ అని ప్రజలు అంటున్నారని తెలుసుకున్న చంద్రబాబు తన దత్తపుత్రుడితో కూడా పలు సందర్భాల్లో దుష్ప్రచారం చేయించడం తెలిసిన విషయమేనన్నారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులకు పట్టాలకు బదులుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇద్దామన్నా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం పెడదామన్నా మొదట్లోనే అడ్డుకునే ప్రయత్నం చేశారని, అయినా సీఎం జగన్ మాత్రం బెదరకుండా మొండి ధైర్యంతో అనుకున్నవన్నీ నెరవేర్చారని గుర్తుచేశారు. కాబట్టి జగన్ చేసిన మంచిని ఎన్నికల ముందు ప్రజలకు ఒక్కసారి గుర్తు చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపైనా ఉందని స్పష్టం చేశారు.

మహిళల గౌరవాన్ని పెంచిన సీఎం జగన్...

నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ ఏపీలో మహిళల గౌరవాన్ని పెంచిన ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మహిళలు ఆరాధిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండీ హబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కోనపరెడ్డి జయరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, జిల్లా ప్రచారకమిటీ కార్యదర్శి పెన్మెత్స రామరాజు, రెడ్డి అండ్ రెడ్డి అధినేత గొలుగూరి శ్రీరామారెడ్డి, నాయకులు ఎస్‌వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతోనే వైఎస్సార్ సీపీ విజయం


ఉరదాళ్లపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధే ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు జరుగుతున్నాయని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన సమావేశంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి 80 కుటుంబాలు మంత్రి కారుమూరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా 58 నెలల కాలంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం పేద వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. ఏ ఒక్క అర్హుడు కూడా నాకు ఈ పథకం అందలేదని ఎక్కడా నా దృష్టికి రాకూడదన్న సీఎం స్పష్టమైన ఆదేశాలతో అధికార యంత్రాంగం సైతం పగడ్బందీగా పని చేసిందన్నారు. ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే ఉద్దేశ్యంతో స్పందన వంటి కార్యక్రమాలు నిర్వహించి అధికారులను నేరుగా కలిసే విధంగా కార్యక్రమాలు నిర్వహించి జగనన్న ప్రజల మనస్సులు గెలుచుకున్నారని అన్నారు. ఈ పరిస్థితులన్నీ బేరీజు వేసుకుని మన కుటుంబానికి మంచి జరిగిందనే ఉద్దేశ్యంతో ఇతర పార్టీల నుంచి అత్యధిక శాతం వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారందరికీ అండగా ఉంటానని, పార్టీని బలోపేతం చేసేందుకు ఈ రెండు నెలల కాలంలో కష్టపడి పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణిప్రసాద్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఉరదాళ్లపాలెం సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్, అత్తిలి ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గుండుమోగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సెమినార్‌కు హాజరైన నన్నయ్య విద్యార్థులు


సెమినార్‌కు వెళ్లిన గూడెం నన్నయ్య విద్యార్థులు

తాడేపల్లిగూడెం: భీమవరంలోని విష్ణు ఫార్మసీ కళాశాలలో జరిగిన ప్రోమిలాన్ 2024లో కార్యక్రమానికి గురువారం నన్నయ్య విద్యార్థులు హాజరయ్యారు. ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అభివృద్ధిలో బయోసిమిలర్ల పాత్ర, ఆవిష్కరణలుపై ఈ సెమినార్ జరిగింది. గూడెం నన్నయ్యలో ఫార్మసీ చదువుతున్న విద్యార్థులు పోస్టర్ ప్రదర్శన చేసి గుర్తింపు పొందారు. ఔషధాల పురోగతికి, పరిశోధన, ఆవిష్కరణల సంస్కృతి విషయాల గురించి సెమినార్‌లో చర్చించారు. సెమినార్‌లో ప్రతిభ చూపించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ టి.అశోక్ అభినందించారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించండి

పాలకోడేరు: సార్వత్రిక న్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్, ఎస్సై నాలం శ్రీనివాస రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు గురువారం పాలకోడేరులోని రైతు భరోసా కేంద్రంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అల్లరి చిల్లర పనులు చేసి కేసుల్లో ఇరుక్కోవద్దని హితవు పలికారు. ఎటువంటి గొడవలు జరగకుండా చూసి పాలకోడేరు మండలానికి మంచిపేరు తీసుకు రావాలని ఎస్సై కోరారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగభూషణం నాయుడు, వీఆర్వోలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఉండి: పెదపుల్లేరు గ్రామంలో భ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు పూజా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాలలయ నిర్మాణానికి పెదపుల్లేరు గ్రామ పెద్దలు, భక్తులు కలసికట్టుగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లరాజు, సుచిత్ర కృష్ణంరాజు, రంగరాజు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద పెత్తున పాల్గొన్నారు.

పోచమ్మ తల్లికి 3 కాసుల బంగారం సమర్పణ

వీరవాసరం: మండలంలోని గండి పోచమ్మ తల్లి అమ్మవారికి మూడు కాసుల బంగారాన్ని గురువారం సమర్పించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మద్దాల రామకృష్ణమ్మ దత్తత కుమారుడు నాగబుల్లి తాతయ్య కుమార్తెలు పద్మ,గాయత్రి దేవి, శారదా, సీతా మహాలక్ష్మి, ఉమా దేవి, ఇందిరాదేవిలు అమ్మవారికి మూడు కాసుల బంగారాన్ని బహుకరించారు. మద్దాల అప్పారావు, గుండా నరసింహారావు, దాతలు పాల్గొన్నారు.

తణుకు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


సూరంపూడి కామేష్


ఈద రామకృష్ణ

తణుకు: తణుకు బార్ అసోసియేషన్ (న్యాయవాదుల సంఘం) 2024-25 ఏడాదికి నూతన కార్యవర్గం కోసం గురవారం ఎన్నికలు జరిగా యి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా సూరంపూడి కామేష్, ఉపాధ్యక్షుడిగా కొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఈద రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా ఎంఎస్ ఆచారి, కోశాధికారిగా ఎం.మృత్యుంజయరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా హెచ్.నాగార్జునదాస్, లైబ్రరీ సెక్రటరీగా ఎం.ప్రతాప్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టండి

భీమవరం (ప్రకాశంచౌక్): తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింటు కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేటు వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్‌లో వేసవి కాలం సందర్భంగా చలివేంద్రాలు ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రానున్న మూడు నెలలో జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. బస్‌స్టాండ్‌లో, రైల్వేస్టేషన్, పరిశ్రమలు, ఉపాధి హామీ కూలీలు, కార్మికులు ఉదయం, సాయంత్రం పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు చేసే చోట చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె చెన్నయ్య, జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కె.సీ.హెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

తూర్పువిప్పర్రులో వైఎస్సార్ సీపీ ప్రచారం


బూత్‌స్థాయి సమావేశంలో పాల్గొన్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

ఇరగవరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెన్మత్స సుబ్బరాజు, చోడే జోషి, మామిడిశెట్టి శ్రీను, గంజి సతీష్, సైపురెడ్డి పెద్దిరాజు పాల్గొన్నారు.

జట్లపాలెంలో సివిల్ రైట్స్ డే


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెంటపాడు మండలంలోని జట్ల పాలెంలోని పంచాయతీ కార్యాలయం వద్ద సివిల్ రైట్స్ డే కార్యక్రమం పెంటపాడు ఆర్ఐ కనకదుర్గ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ కుల, వర్గ, జాతి, మత భేదం లేకుండా అందరూ సమానమని, అగ్రవర్ణాలు ఎవరైన వివక్షణకు గురి చేస్తే చట్టపరమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. గత ప్రభుత్వాలు వివక్షతకు గరైతే పట్టించుకునే వారు కాదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వచ్చిన తరువాత ఎస్సీ,ఎస్టీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఏఎస్సై, సాంఘీక సంక్షేమ అధికారి, గ్రామ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 27, 30వ వార్డుల ఉమ్మడి వీధి ఉంగరాలవీధిలో గత ఐదు రోజులుగా మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, కుళాయిలు నుంచి అసలు నీరు రావడం లేదని, నీటి సమస్యను పరిష్కరించాలని గురువారం మున్సిపల్ కమిషనర్ శామ్యూల్‌కు స్థానికులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. స్థానికులు మాట్లాడుతూ నీటి సమస్యలు తరుచుగా వస్తున్నాయన్నారు. రానున్న వేసవి దృష్ట్యా సమస్యను పరిష్కరించాలని కోరారు.